క్లుప్తంగా

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

పులివెందుల టౌన్ : ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిని పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ శ్రీనిత హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎలక్షన్ డ్యూటీలో పాల్గొన్న వలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత



కాలువలో జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం

కమలాపురం : స్థానిక డ్రైనేజీ కాలువల్లో పేరకపోయిన పూడికను కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. గురువారం గండ్లూరు కాలనీలో ఉన్న పెద్ద కాలువను జేసీబీతో శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఎర్రగుంట్ల సీఐగా నరేష్‌బాబు



ఎర్రగుంట్ల : స్థానిక అర్బన్ సీఐగా నరేష్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఈశ్వరయ్యను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లాలో వీఆర్‌లో ఉన్న సీఐ నరేష్ బాబును ఇక్కడికి బదిలీ చేశారు. ఇతను జమ్మలమడుగు నియోజకవర్గంలోని ముద్దనూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేశారు. అలాగే బదిలీ అయిన సీఐ ఈశ్వరయ్యను గురువారం పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నివాళి



సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : నగర పంచాయతీ 8వ కౌన్సిల్ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి తల్లి గోటూరు సుబ్బమ్మ గురువారం మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆమె నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, అల్లె రాజారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య లేకుండా చేస్తాం



తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

జమ్మలమడుగు : పట్టణంలో తాగునీటి సమస్యలేకుండా చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన కొన్ని ప్రాంతాల్లో పర్యటించి తాగునీటిని సమస్యలేకుండా చూస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో గంబూషియా చేపలు విడుదల



వర్షపు నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కడప రోడ్డులోని చందమామ దాబా వెనుక ప్రాంతంలో నిల్వ ఉన్న వర్షపు నీటిలో గంబూషియా చేపలను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రమణారెడ్డిలు నీటిలో వదిలి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల నుంచి తమను తాము రక్షించుకోవాలన్నారు.

పింఛన్లు పంపిణీ

కమలాపురం : మండలంలో 98.01 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6983 మంది పింఛనర్లు ఉండగా 6844 మందికి పంపిణీ చేశామన్నారు.

పత్తి, మినుము, వేరుశనగపై రైతుల ఆసక్తి

- పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల ఎకరాలలో సాగు
- వర్షాలు కురుస్తాయన్న ఆశతో పంటల సాగు



నల్లచెరువుపల్లె వద్ద సాగు చేసిన వేరుశనగ పంట



ఖరీఫ్‌లో సాగైన పత్తి పంట

వేముల : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడు ఖరీఫ్‌లో పత్తి, మినుము పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపారు. గత ఏడాది అదునులో వర్షాలు పడి పంటలు సాగయినప్పటికీ తదనంతరం వర్షాభావం నెలకొనడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడు కూడా పదునులో వర్షాలు పడినప్పటికీ సాగు అనంతరం వర్షాలు లేకపోతే దిగుబడులు చేతికి అందవన్న ఉద్దేశంతో విస్తారంగా సాగయ్యే పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కువగా మినుము, పత్తి పంటలతో పాటు అక్కడక్కడ వేరుశనగ పంటను రైతులు సాగుచేస్తున్నారు. వేరుశనగ పంట పెట్టుబడులతో కూడుకున్నది కావడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపలేదు. కొంత మంది రైతులు కొన్ని గ్రామాల్లో మాత్రమే వేరుశనగ పంటను సాగు చేశారు. కొన్ని సంవత్సరాలుగా వేరుశనగ స్థానంలో ఖరీఫ్‌లో ప్రధాన పంటగా పత్తిపంట చేరింది. మినుము పంట కూడా ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగుచేసుకున్నారు. పంట కాలం 90 రోజులు కావడంతో రైతులు మినుము పంటపై దృష్టి పెట్టారు. మినుము పంటలో దిగుబడులు పూర్తి అవగానే రబీకి పొలాలను సిద్ధం చేసుకుని రబీలో వేరుశనగ సాగు చేసుకోవచ్చన్న ఉద్దేశంతో రైతులు మినుము పంటను ఎంచుకున్నారు.

దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు

పంటలను జూన్, జూలై మాసాల్లో సాగు చేసుకున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి దిగుబడులు వస్తాయనే ఆశ రైతుల్లో నెలకొంది. ఇప్పటివరకు పంటలు దెబ్బతినకుండా అప్పుడప్పుడు పడుతున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి. అయినా వేరుశనగ సాగు చేసిన రైతుల్లో మాత్రం ఆందోళన కనిపిస్తోంది. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి వేరుశనగ సాగుచేశామని వర్షాలు ఏ విధంగా ఉంటాయో తెలియడం లేదని రైతులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ సాగులో దిగుబడులు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు కూడా చేతికి అందక నష్టాలు చూసిన రైతులు ఈ ఏడాది వేరుశనగపై ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలకు వరుణుడు కరుణిస్తాడో.. లేదో వేచి చూడాల్సిందే.

20 వేల ఎకరాల్లో పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారం కింద రైతులు విరివిగా పంటలు సాగుచేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలోనే వేముల, చక్రాయపేట మండలాల్లో అత్యధికంగా వేరుశనగ పంటను వేముల, వేంపల్లె మండలాల్లో పత్తిపంటను సాగుచేశారు. మినుము పంట నియోజకవర్గవ్యాప్తంగా సాగయ్యింది. ఇందులో వేరుశనగ పంట 8 వేల ఎకరాల్లోనూ, పత్తి పంట 10 వేల ఎకరాల్లోనూ, మినుము పంట 2వేల ఎకరాల్లో సాగయ్యింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిస్తే పంటలో దిగుబడులు ఉంటాయని, సాగులో పెట్టుబడులు అయినప్పటికీ ఆదాయం ఉంటుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.



వేముల వద్ద సాగులో ఉన్న మినుము

5 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా



ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారం కింద నాకున్న 5 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. సాగుకు రూ.70 వేల మేర పెట్టుబడులు పెట్టా. పదునులో పంటలు సాగు కావడంతో దిగుబడులు ఉంటాయనే ఆశతో ఉన్నా. దిగుబడులు అందే సమయానికి ఇంకా రూ.80 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. కలుపు తీయడంతో పాటు వేరుశనగ కట్ట పీకను, కూలీల ఖర్చు అదనంగా అవుతున్నాయి. పెట్టుబడి పెట్టినా ఆదాయం ఉంటుందని ఆశతో ఉన్నాం.

– ఈశ్వర్‌రెడ్డి, రైతు, నల్లచెరువుపల్లె

పత్తిలో ఆదాయం వస్తుందనే



ఈ ఏడాది పత్తి పంటలో ఆదాయం ఉంటుందని సాగు చేశా. నాకున్న 4 ఎకరాల్లో వర్షాధారం కింద పత్తి పంట సాగు చేశా. సాగుకు రూ.80 వేలు పైనే పెట్టుబడులు అవుతున్నాయి. ఇప్పటికే రూ.40 వేలు సాగుకు ఖర్చు చేశా. పెట్టుబడులు పెట్టినప్పటికీ దిగుబడులు వచ్చి ధరలు ఉంటాయనే ఆశతో ఉన్నాం.

– కుమార్‌రెడ్డి, రైతు, దుగ్గన్నగారిపల్లె

మొక్కజొన్నలో కత్తెరపురుగు ఉధృతి

ముద్దనూరు : మొక్క జొన్న పంటలో కత్తెరపుర గు ఉధృతి అధికంగా వుందని దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని శెట్టివారిపల్లె గ్రామంలో పంటను పరిశీలించిన ఆయన కత్తెర పురుగు నివారణకు క్లోరోపైరిపాస్ 2.5 మి.లీ.ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, పంటలో గుడ్డు పెట్టే దశలో వున్నప్పుడు 5 మి.లీ. వేప నూనె 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయా లని సూచించారు. ఇమామేక్టిన్ బెంజిట్ అనే మందును 1 ఎకరానికి 100 గ్రాములు కలిపి పిచికారి చేయాలని, లింగాకర్షక బుట్లను ఒక ఎకరానికి 8 పెట్టుకోవాలని ఏవో తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

లింగాల : 33 కేవీ పార్నపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే వెలిదండ్ల సబ్‌స్టేషన్ పరిధి లోని 11 కేవీ కర్నపాపయ్యపల్లె ఫీడర్ పరిధిలో మ ధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు, 11 కేవీ వరదరాజుల స్వామి ఫీడర్ పరిధిలో మధ్యా హ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు, 11 కేఈ వెలిదండ్ల ఫీడర్ పరిధిలో అంతరా యం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ బాలసంజీవులు తెలిపారు.

ధర్నాకు మద్దతు

ముద్దనూరు : మండలంలోని పెద్దదుద్యాల గ్రామ సమీపంలో వున్న కెమికల్ ఫ్యాక్టరీ వద్ద చేస్తున్న ధర్నాకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భూపేష్‌రెడ్డి మద్దతు తెలిపారు.గురువారం ఆయన ధర్నాచేస్తున్న పెద్ద దుద్యాల గ్రామస్తులకు ధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గాలి,నీరు,నేలను కలుషితం చేసి ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందిగా మారిన ఫ్యాక్టరీని మూసివేయాలని ఆయన డిమాండ్ చేసారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దముడియం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయలంలో ఆమె అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంబంధిత శాఖలకు సంబంధించిన ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. ఎన్.కొట్టాలపల్లె, సుద్దపల్లె, భీమగుండం గ్రామాల్లో నీటి సమస్య, పైపులైన్లకు లీకేజీ లాంటి సమస్యలను పరిష్కరించాలని గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. మేడిదిన్నె గ్రామంలో శానిటైజేషన్‌కు ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వాలని, కరెంట్ స్తంభాలు పాతి వైర్లు వేయకపోవడంతో గ్రామంలో కొన్ని గృహాలకు కరెంట్ సరఫరా లేదని ఆ గ్రామ సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మీనరసింహ్మా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

వేంపల్లె : స్థానిక శ్రీరామ్‌నగర్ వీధిలో పింఛన్లను టీడీపీ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి రవీంద్రనాథరెడ్డి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గిడ్డంగివారిపల్లె చెరువు 70 శాతం మేర పనులు పూర్తి కాగా మిగిలిన 30 శాతం పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : నాయనవారిపల్లెలో వృద్ధులకు, వితంతువులకు ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం లాంటివి



కమలాపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు స్వాతిసాయి



లింగాలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ శ్రీలత



సింహాద్రిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కొండాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయ్ తెలిపారు. గురువారం కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఇలా పాలు తాపించడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధు మేహం రాకుండా ఉంటుందన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పెద్ద చెప్పలి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ మాహినూర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలే శ్రీరామరక్ష అని సీడీపీఓ శ్రీలత అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గురువారం అంగన్వాడీ టీచర్లతో కలిసి ఆమె ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తల్లి ముర్రుపాలు పిల్లలకు మొదటి టీకాగా పనిచేస్తాయన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పూలఅంగళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా గర్భిణి, బాలింత మహిళలకు తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. అలాగే పీహెచ్‌సీ హెచ్ఈ షఫీఉన్నీసా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సీహెచ్‌ఓలు, సూపర్‌వైజర్ వెంకటలక్షుమ్మ పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలే అవసరమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కళ్యాణ్‌దినకర్, సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.భారతి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తల్లిపాలు పోషక విలువల గురించి వివరించారు. ఎంపీహెచ్ఓ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి బిడ్డకు ఆరు నెలలు పూర్తి అయ్యేవరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ వసంతకుమారి తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, యూఓఆర్‌డీ పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎంపీకి వినతి



ప్రజల సమస్యలను వింటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న జగన్ క్యాంపు కార్యాలయంలో గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. పులివెందుల నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను వినతుల రూపంలో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొందరు అనారోగ్యంతో ఆస్పత్రికి వెళితే అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించదంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మరికొందరు సంవత్సరం పింఛన్లు తీసుకున్నవారివి టీడీపీ ప్రభుత్వం వచ్చాక తొలగించారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామన్నారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు

సింహాద్రిపురం : స్థానికంగా ఉన్న శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు కడప విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తెలిపారని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ విషయమై పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వల్లిని వివరణ కోరగా మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ భవనం పరిశీలన



పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న డీఈ మురళీ

లింగాల : స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని గురువారం ఏపీఎస్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీఈ మురళీ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ తమకు కోటి రూపాయలు బిల్లులు రావాలని, ఆ బిల్లులు వచ్చేంత వరకు భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించలేమన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు పడమటి వీధిలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం నుంచి అమ్మవారి 95వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు స్థానిక సరస్వతి నగర్‌లో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి అమ్మవారి ఆషా ఢమాస చీరే సారె కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వా రు తెలిపారు. భక్తులు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు గాజులు టెంకాయలతోపాటు చీర, జాకెట్, పూజా సామగ్రితో ఉదయం 8.30 నిమిషాలకు వెంకటేశ్వర స్వామి దేవస్థానం దగ్గరికి రావాలన్నారు. ఇక్కడి నుంచి చౌడేశ్వరిదేవి ఆలయం వరకు వెళ్లాలన్నారు. అలాగే 4వ తేదీ ఆదివారం అమ్మవారి 95వ జయంతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అన్నదాన కార్యక్ర మం ఉంటుందన్నారు.

కల్తీలేని ఆహారంతోనే ఆరోగ్యం

పులివెందుల టౌన్ : కల్తీలేని ఆహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కళాశాలలో కల్తీ ఆహారంపై సర్టిఫికెట్ కోర్సును వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కల్తీలేని ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరు విధిగా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కోర్స్ ద్వారా విద్యార్థులు నాణ్యమైన ఆహార పదార్థాలు తీసుకునే పద్ధతులను నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జువాలజీ హెచ్ఓడీ శ్రీనిత విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు మరింత ప్రోత్సాహం ఇవ్వండి

వేంపల్లె: క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహం ఇవ్వాలని రవాణా, క్రీడా యోజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టెన్నికాయిట్ అసోసియేషన్ ఉమ్మడి కడప జిల్లా కమిటీ కన్వీనర్ ఎస్.బి.రవికుమార్ కోరారు. రాయచోటిలో మంత్రిని గురువారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. రాయచోటి కేంద్రంగా రాష్ట్ర జూనియర్ ఎన్నిక పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో క్రీడా స్టేడియాలు అధ్వానంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాలని కోరారు. క్రీడా శిక్షకుల సంఖ్య కూడా పెంచాలని కోరారు.

అతిథి అధ్యాపకుల నియామకాలకు ఆహ్వానం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి నియామకాలు చేపడతారని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు.

కళాశాల కార్యాలయంలో శుక్రవారం, 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ (1), కామర్స్(1) సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులన్నారు. మాస్టర్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత, నెట్, సెట్ కలిగిన వారికి ద్వితీయ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకి హాజరు కావాల్సిన వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు.

పులివెందుల వ్యవసాయ శాఖ ఏడీఏగా ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయశాఖ డివిజన్ ఏడీఏగా గురువారం అంబవరం ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం అంబకపల్లె రోడ్డులోని మినిసెక్రటేరియట్‌లో ఉన్న వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల డివిజన్ ప్రాంతంలో వ్యవసాయంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు.



మాట్లాడుతున్న ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

నెరవేరిన మాదిగల చిరకాల స్వప్నం

కమలాపురం : మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ నెరవేరడం హర్షణీయం అని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాదిగ సంతోషం వ్యక్తం చేశారు. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకే ఉందని సుప్రీం తీర్పు ఇవ్వడం పట్ల గురువారం ఆయన పట్టణంలో ప్రజలకు స్వీట్లు తినిపించారు. అలాగే క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కమలాపురంలో స్వీట్లు తినిపిస్తున్న నరసింహులు

వేంపల్లెలో..

వేంపల్లె : ఎస్సీ వర్గీకరణపై కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ వేంపల్లెలోని నాలుగురోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంఈఎఫ్ మండల కన్వీనర్ గంగయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు పిచుకబాబు ఆధ్వర్యంలో మాదిగల పోరాట సమితి నాయకులు మిఠాయిలు తినిపించుకున్నారు.

పులివెందులలో

పులివెందుల టౌన్ : ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఈఎఫ్ నాయకులు కోళ్లభాస్కర్, రామకృష్ణ, సూరి, రామాంజనేయులు, హరి, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో సంబరాలు బస్టాండులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈనెల 4వ తేదీన స్థానిక విజయహోంలో నిర్వహించే మాదిగల సర్వసభ్య సమావేశానికి పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల కార్యవర్గ సభ్యులు, మాదిగ సోదరులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.